

తులసి దంపతులతో పిల్లలు

ఇద్దరు పిల్లలకూ వర్తించలేదు

మాణికల ఉల్లరయ్య, తులసి దంపతులది బేస్తవారిపేట మండలంలోని సోమవారిపేట గ్రామం. బతుకుదెరువు కోసం జామాయిల్ కర్ర కొట్టేందుకు సంతనూతలపాడుకు ఏడాది క్రితం వలస వెళ్లారు. వీరికి ఇద్దరు పిల్లలు తేజశ్విని, మమత ఉన్నారు. తేజశ్విని ఏడో తరగతి చిలకపాడులో, మమత తక్కెళ్లపాడు ప్రభుత్వ పాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం పడలేదు. బేస్తవారిపేట సచివాలయ సిబ్బందిని అడిగితే గ్రీవెన్స్ పెట్టుకుని, హౌస్ మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు.

జాబితాలో పేరుంది కానీ నగదు రాలేదు



కుమార్తె షైనీతో తండ్రి శ్యామ్

చిన్నం శ్యామ్, ప్రేమకుమారి దంతపతులు బేస్తవారిపేటలోని జెడ్పీ హైస్కూల్ సమీపంలో నివసిస్తున్నారు. శ్యామ్ క్యాటరింగ్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎలిజిబుల్ జాబితాలో చిన్న కుమార్తె చిన్నం షైనీ పేరు వచ్చింది. బ్యాంకు ఖాతాలో నగదు జమ కాలేదు. సచివాలయ సిబ్బందిని అడిగితే ఆధార్ అప్‌డేషన్ చేయించుకోవాలని సూచించారు. బేస్తవారిపేటలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో కంభం పరిసర ప్రాంతాల్లో ఆధార్ నమోదు కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి.

అమ్మ ఒడి అందింది.. తల్లికి వందనం ఆగింది



హేమేశ్వరరెడ్డితో తల్లి నాగపద్మావతి

బేస్తవారిపేట మండలంలోని పాపాయిపల్లెకు చెందిన మిట్టా సుబ్బారెడ్డి, నాగ పద్మావతి దంపతుల కుమారుడు హేమేశ్వరరెడ్డి ఇక్కడి యశ్వంత్ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ విద్యార్థికి అమ్మ ఒడి పథకం వర్తించింది. కూటమి సర్కారులో మాత్రం తల్లికి వందనం పథకాన్ని దూరం చేశారు. నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ఒకటే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వివరాలు లేవంటూ గ్రీవెన్స్‌లో సమాధానం వచ్చింది.

నలుగురు పిల్లల్లో ఒక్కరికే..



ఒక్కరికే నగదు పడిందని చెబుతున్న జగన్నాథం అంజనమ్మ

గిద్దలూరు పట్టణంలోని కొంగలవీడు రోడ్డులోని ఎస్టీ కాలనికి చెందిన జగన్నాథం అంజనమ్మకు నలుగురు సంతానం మొదటి సంతానం ఇమ్మానియేల్ 5 వ తరగతి, దానియేలు 3 వ తరగతి, జాషువ 1 వ తరగతి, జెస్సీ అంగన్‌వాడీకి వెళుతుంది. మొత్తం నలుగురు పిల్లలకు గాను ఒక్కరికి మాత్రమే తన అకౌంట్‌లో డబ్బులు పడ్డాయని ఆ డబ్బులు తీసుకునేందుకు పట్టణంలోని ఆంధ్ర ప్రగతి బ్యాంకు వచ్చి క్యూలో నిలుచుంది.

సంక్షేమానికి సవాలక్ష కొర్రీలు!

- అర్హులకూ అందని తల్లికి వందనం పథకం
- లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియలో ఇష్టారాజ్యం
- సహేతుకమైన కారణాలు చూపకుండానే రిక్త హస్తం
- ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎగనామం
- రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలతో సరిపెట్టడంపై విమర్శలు

బేస్తవారిపేట: సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన కూటమి ప్రభుత్వం అదేమీ చేయకుండా కొర్రీలు పెడుతోంది. ప్రతిష్టాత్మక పథకంగా చెబుతున్న తల్లికి వందనం స్కీమ్‌లో అర్హులైన విద్యార్థుల పేర్లు ఎగరగొట్టడం, ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ కాకుండా ఒకరికే నగదు వేయడంతో క్షేత్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సహేతుకమైన కారణాలు చూపకుండా లబ్ధిదారుల జాబితాలో విద్యార్థుల పేర్లు తొలగించడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు లేకపోయినా వాడినట్లు, కుటుంబంలో ఆదాయ పన్ను ఎవరూ చెల్లించకనోయినా చెల్లిస్తున్నట్లు చూపుతూ వందలాది మంది విద్యార్థులకు సర్కారు కోత పెట్టింది.

ఇంటర్ విద్యార్థులకు దూరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రకటించిన హామీలు అమలు చేసి ఉంటే గత ఏడాది ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకం వర్తించేది. నేడు ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరికీ ఈ పథకం దూరమైంది. ఇంటర్మీడియెట్ తర్వాత ఉన్నత చదువులకు వేరే ప్రాంతాలకు వెళ్లిన, ఫెయిలైన విద్యార్థులు ఈ పథకానికి పూర్తిగా దూరమైనట్లే.

పిటికాయగుళ్ల హైస్కూల్ కనుమరుగు

తల్లికి వందనం పథకం అమలు తీరులో సర్కారు డొల్లతనాన్ని బట్టబయలు చేసిన సంఘటన ఇది. బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్లలో ఏకంగా ఓ పాఠశాలనే తల్లికి వందనం పథకానికి దూరం చేయడం సంచలనంగా మారింది. పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్లో మూడోవ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 134 మంది ఉన్నారు. పిటికాయగుళ్ల సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాల, బయటి ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి ఫైనల్ ఎలిజిబుల్, ఇన్ ఎలిజిబుల్ జాబితాలో పేర్లు వచ్చాయి. అయితే ఈ జాబితాలో హైస్కూల్లో చదువుతున్న 134 మంది విద్యార్థుల వివరాలు లేవు.



134 మంది విద్యార్థులకు తల్లికి వందనం వర్తించని పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్

వైఎస్ జగన్ హయాంలో పారదర్శకంగా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఆయా పార్టీలకు అనుకూలంగా ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మరీ ముఖ్యంగా గ్రామాల్లో కక్ష గట్టి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను అనర్హుల జాబితాల్లోకి చేర్చడం తీవ్ర చర్చనీయాంశమైంది. తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామంటూ ప్రతి మీటింగ్‌లోనూ చంద్రబాబు, లోకేష్‌పాటు పవన్‌కళ్యాణ్ ఊదరగొట్టారు. అవే మాటలను నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. సీన్ కట్ చేస్తే.. నేడు అడ్డగోలు నిబంధనలతో పథకానికి కొర్రీలు వేస్తున్నారు.

బేస్తవారిపేట మండలంలో తల్లికి వందనం అర్హులు, అనర్హుల వివరాలు

సచివాలయం	అర్హుల సంఖ్య	అనర్హుల సంఖ్య
అక్కపల్లె	317	46
బసినేపల్లె	467	23
బేస్తవారిపేట-1	642	191
బేస్తవారిపేట-2	536	199
చెట్టిచర్ల	156	26
గలిజేరుగుళ్ల	613	45
జేబీకే పురం	141	36
జేసీ అగ్రహారం	514	20
కోనపల్లె	347	09
మోక్షగుండం	367	43
ఎంపీ చెరువు	386	68
నేకునాంబాద్	312	66
పిటికాయగుళ్ల	180	42
పీఓ పల్లె	372	17
పూసలపాడు	393	54
సలకలవీడు	354	25

ఒకటే తిప్పడు.. గతంలో లేదెన్నడు!

- అన్నదాత సుఖీభవ పథకం వర్తింపులో గందరగోళం
- గత ప్రభుత్వంలో సర్కారు భూమి కలిగిన పేదలకు రైతు భరోసా
- వారిని జాబితా నుంచి తొలగించిన కూటమి సర్కారు
- ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ జనం చక్కర్లు



బ్యాంకు ఖాతాలో నగదు పడిందో లేదో తెలుసుకుంటున్న మహిళలు

గిద్దలూరు రూరల్: సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వ తీరుతో పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులను గుర్తించేందుకు, వారి వివరాలు నమోదు చేసేందుకు అవకాశాలున్నా సర్కారు వ్యవహరిస్తున్న తీరు మాత్రం గందరగోళ పరిస్థితులు సృష్టిస్తోంది. అర్హుల జాబితాలో పేర్లు ఉన్నాయా, లేవా? బ్యాంకు ఖాతాల్లో నగదు పడిందా లేదా? అని తెలుసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, పోస్టాఫీసులు, బ్యాంకుల చుట్టూ జనం చక్కర్లు కొడుతున్నారు. ముగ్గురు, నలుగురు, ఇద్దరు పిల్లలు ఉన్న తల్లుల ఖాతాల్లో ఇప్పటి వరకు ఒకరికి మాత్రమే నగదు జమ చేశారు. సచివాలయాలల్లో అర్హుల జాబితాల్లో పేర్లు ఉన్నప్పటికీ వారి అకౌంట్లలో అసలు డబ్బు పడలేదు. దీంతో వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ భూమి కలిగిన మహిళా రైతులు

రైతు భరోసా వచ్చింది.. సుఖీభవ ఎందుకు రాదు?

అన్నదాత సుఖీభవ పథకం ప్రభుత్వ భూములు కలిగిన వారికి వర్తించని సర్కారు ప్రకటించడంతో పేద, దళిత రైతులు ఆందోళన చెందుతున్నారు. గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన కొందరు దళితులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున సాగు భూమి గతంలో ప్రభుత్వమే పంపిణీ చేసింది. అన్నదాత సుఖీభవ వర్తించని తెలియడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలె తీసుకుని మంగళవారం గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గతంలో రైతు భరోసా కింద నగదు ఇచ్చారు, ఇప్పుడు అన్నదాత సుఖీభవ ఎందుకు రాదు అని ముండ్లపాడు గ్రామానికి చెందిన బి.మేరిసుజాత ప్రశ్నించింది. ప్రభుత్వమే ఆ నిబంధన విధించిందని తామేమీ చేయలేమని అధికారులు జవాబివ్వడంతో నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడు కంకణాల మృతి



పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంకణాల రమేష్ (54) మృతి చెందారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రమేష్, ఆపరేషన్ తాలూకా ఇబ్బందులు రావటంతో చెన్నై వైద్యశాలకు వెళ్లాడు. అక్కడ ఆరోగ్యం విషమించి అకస్మాత్తుగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆర్య వైశ్య సంఘం కోశాధికారిగా ఆయన పనిచేస్తున్నారు. గతంలో శ్రీనిర్మమహేశ్వరస్వామి వారి దేవస్థానం చైర్మన్‌గా పని చేశారు. కొనకనమిట్ల మండలం, పొదిలి పట్టణంలో రమేష్ పార్టీకి కీలక నాయకుడు. పార్టీ వ్యవహారాల్లో చాలా చురుగ్గా వ్యవహరించే రమేష్ మృతి పార్టీకి తీరని లోటలని పలువురు నివాళులర్పించారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ మృతదేహాన్ని మంగళవారం రాత్రికి విశ్వనాథపురంలోని స్వగృహానికి తీసుకొస్తున్నట్లు బంధువులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన పశువైద్యాధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగమణి

రాచర్ల: మండలంలోని అనుమలవీడు పశువైద్యాధికారిగా పి.నాగమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన వి.సాయి చక్రవర్తి నెల్లూరు జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో దర్శి మండలం రాజంపల్లి పశువైద్యాధికారి పి.నాగమణిని బదిలీపై నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యశాలలో పాడిరైతులకు అందుబాటు ఉండి మెరుగైన సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

వేతన పెంపుపై కాంట్రాక్టు కార్మికుల వినతి

మార్కాపురం టౌన్: మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ కార్మికుల వేతనం పెంచాలని, లేని పక్షంలో సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకే ఎం రఫీ పేర్కొన్నారు. మంగళవారం కాంట్రాక్టు కార్మికుల వేతనం పెంచాలని కోరుతూ మున్సిపల్ కమిషనరు నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు జీవోఎంఎస్ నం.36 ప్రకారం రూ.21 వేలు మాత్రమే ఇస్తున్నారని, రూ.24,500కు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు పీఆర్‌సీ, కరువు భత్యం, ఐఆర్, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, చనిపోయిన, అనారోగ్యంపాలైన ఉద్యోగుల స్థానంలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20వ తేదీ తర్వాత రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని, ప్రభుత్వమే అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారాయుడు, హరి, నాయకులు సలాంఖాన్, రమణ, శేషిరెడ్డి, అల్లూరయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ బుజ్జీబాయి

మార్కాపురం: రైతులు భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువులు, కౌలు రైతులు కౌలు కార్డులు వీఆర్‌ఓల ద్వారా పొందవచ్చని మార్కాపురం ఏఓ బుజ్జీబాయి తెలిపారు. మంగళవారం ఇడుపూరు, బోడపాడు గ్రామాల్లో రైతులతో ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ ఈకేవైసీ కూడా పీ4 సర్వే ద్వారా ఆటోమేటిక్‌గా పూర్తవుతుందని, ఈకేవైసీ చేయించుకోని వారికి మరలా అవకాశం ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఇడుపూరు, బోడపాడు రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయిరామ్, పవనేశ్వరి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కలుజువ్వలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

తర్లుపాడు: అన్నదాత సుఖీభవతోపాటు ప్రభుత్వ పథకాలు పొందాలంటే మండలంలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ జ్యోత్స్న తెలిపారు. మంగళవారం తర్లుపాడు, కలుజువ్వలపాడు గ్రామాల్లో రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు మల్లికార్జున, బుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

బేస్తవారిపేట: ప్రస్తుత పరిస్థితుల్లో భూములు నిస్సారంగా మారుతున్నాయని, రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. మంగళవారం జేబీకే పురం, చెట్టిచర్లలో రైతులతో ఏడీఏ మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి, పూత దశలో భూమిలో కలియదున్నితే సారవంతం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, వీఏఏలు పాల్గొన్నారు.

అర్ధవీడు: మండల పరిధిలోని బోగోలు, మోహిద్దీన్‌పురం గ్రామాల్లో రైతులతో ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. పీఎం కిసాన్ సాయం అందని రైతుల వివరాలు నమోదు చేశారు. అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ జి.శివగంగాప్రసాద్, వీఏఏ భారతిబాయి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి



మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గమనిస్తుండాలని మార్కాపురం సీఐ సుబ్బారావు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనపై అనుమానం వస్తే వెంటనే కౌన్సెలింగ్ ఇవ్వడమే కాకుండా, ఆ సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు చేరవేయాలని చెప్పారు. విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తే అందుకు అనుగుణంగా వారి ప్రవర్తన ఉంటుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో ఘర్షణ



వైద్యశాలలో చికిత్స పొందుతున్న అబ్దుల్ రఫి

కంభం: ఎగ్జిబిషన్ లో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి చేతికి గాయమైంది. వివరాల్లోకి వెళితే స్థానిక వైజంక్షన్ సమీపంలో ఉన్న ఎగ్జిబిషన్ లో పనిచేస్తున్న ఇరువురి మధ్య మంగళవారం జరిగిన ఘర్షణలో తనను అల్లబకాష్ అనే వ్యక్తి కత్తితో దాడి చేయడంతో గాయమైందని క్షతగాత్రుడు అబ్దుల్ రఫి తెలిపాడు. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

విద్యుత్ షాక్‌కు గురై హెల్పర్‌కు గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న హెల్పర్

కంభం: విద్యుత్‌లైన్ వద్ద మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై హెల్పర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే హెల్పర్ నాగరాజును లైన్‌మెన్ మరమ్మతుల నిమిత్తం తీసుకెళ్లగా పనిచేస్తున్న సమయంలో ప్రమాదానికి గురై తలకు, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

గిద్దలూరు రూరల్: కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని ఏఓ విజయభాస్కర్ రెడ్డి సూచించారు. మండలంలోని సంజీవరాయుడుపేట, ఓబులాపురం గ్రామాల్లో మంగళవారం కౌలు గుర్తింపు కార్డులు అందజేశారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందేందుకు కౌలు గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని చెప్పారు. పశువుల బీమా కోసం ఒక్కో పశువుకు రూ.200 చెల్లించాలని పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మధుసూదనరావు, హెచ్‌ఓ శ్వేత, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, వీఏఏ రవి, వెటర్నరీ అసిస్టెంట్ విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కౌలు కార్డులు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

‘మీరు వెళ్లకండి సార్..’

- బదిలీ అయిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం
- భావోద్వేగానికి లోనైన విద్యార్థులు, గ్రామస్తులు



ఉపాధ్యాయుడికి వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

తర్లుపాడు: సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు సేవా కార్యక్రమాల్లో సైతం ముందుండే ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు, గ్రామస్తులు భావోద్వేగానికి లోనయ్యారు. ×మీరు వెళ్లకండి సార్.. ఇక్కడే ఉండండి సార్..₹ అంటూ ఆ ఉపాధ్యాయుడిని చిన్నారులు బతిమాలారు. ఇందుకు తర్లుపాడు మండలంలోని లక్ష్మక్కపల్లి ఎంపీపీ పాఠశాల వేదికైంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కళ్ళెట్టి జగన్‌బాబు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జగన్నాథపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లుగా గ్రామానికి, పాఠశాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పి.వినోద్, సహోపాధ్యాయులు అబ్దుల్ షకూర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.